సాక్షి కామారెడ్డి

బుధవారం । 29 । మార్చి । 2023



సభ్యత్వ రద్దు సరికాదు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం సరికాదని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు.

- 9లో ▸



తరిమికొట్టండి


అబద్ధాలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ నేతలను తరిమికొట్టాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.


- 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.7 /15.9

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోస్తుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. ఈదురు గాలులు వీయవచ్చు.





టూ వీలర్..
సేల్స్ ధమాల్!



జిల్లాలో వాహనాల అమ్మకాలు ఏడాదికేడాది తగ్గుతున్నాయి. ముఖ్యంగా బైక్‌ల అమ్మకాలు పడిపోతున్నట్టు తెలుస్తోంది. మూడేళ్ల రికార్డులను పరిశీలిస్తే ఏటా రెండు వేల పైచిలుకు వాహనాల అమ్మకాలు తగ్గుతున్నట్లు స్పష్టమవుతోంది. బైక్‌ల అమ్మకాలు గణనీయంగా తగ్గగా.. ఆటోలు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరుగుతుండడం గమనార్హం. కార్ల అమ్మకాలు పరవాలేదన్నట్లుగా ఉండగా.. వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్లు, ట్రాలీల అమ్మకాలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

- ఏటా పడిపోతున్న అమ్మకాలు
- కార్లపై తగ్గని మోజు
- పెరిగిన ఆటోల కొనుగోళ్లు
- ట్రాక్టర్ల కొనుగోళ్లలో తగ్గుదల

సాక్షి, కామారెడ్డి: వాహనాల రిటైల్ అమ్మకాలను రిజిస్ట్రేషన్ల ప్రాతిపదికగా లెక్కిస్తారు. జిల్లాలో టూ వీలర్లు, ప్రయాణికుల వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు రెండేళ్లుగా తగ్గుతూ వస్తున్నాయి. 2020–21 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 18,352 వాహనాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2021–22 లో 15,722 వాహనాలు, 2022–23 లో 13,312 వాహనాల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. అంటే ఏటా 2 వేల పైచిలుకు అమ్మకాలు తగ్గుతున్నాయి.

ధరల పెరుగుదల ప్రభావం..

గతంలో బైక్‌ల అమ్మకాలు ఎక్కువగా ఉండేవి. వీటి ధరలు ఇటీవలి సంవత్సరాలలో గణనీయంగా పెరిగాయి. దీని ప్రభావం వాహనాల కొనుగోళ్లపై పడినట్లు తెలుస్తోంది. జిల్లాలో 2020–21 ఆర్థిక సంవత్సరంలో 14,318 వాహనాల రిజిస్ట్రేషన్లు జరగ్గా.. 2021–22 లో 12,290 కు తగ్గిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 9,539 వాహనాల రిజిస్ట్రేషన్లే జరగడం గమనార్హం. ధరలు పెరగడంతో చాలామంది కొత్త బైక్‌లను కొనుగోలు చేయకుండా.. సెకండ్ హ్యాండ్ బైక్‌లవైపు మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో బైక్‌ల అమ్మకాలు తగ్గినట్లు తెలుస్తోంది.

కార్ల అమ్మకాలు..

కోవిడ్ తర్వాత చాలామంది కార్ల కొనుగోళ్లపై ఆసక్తి చూపారు. దీంతో కార్ల అమ్మకాలలో కొంత వృద్ధి కనిపించింది. 2020 –21 ఆర్థిక సంవత్సరంలో 1,110 కార్ల రిజిస్ట్రేషన్ జరగ్గా.. 2021–22 లో 1,396 కి పెరిగింది. ఈసారి ఇప్పటివరకు 1,333 కార్ల రిజిస్ట్రేషన్లు రికార్డయ్యాయి. కొందరు కొత్త కార్ల వైపు మొగ్గు చూపుతుండగా.. చాలామంది సెకండ్ హ్యాండ్ కొనుగోలు చేస్తున్నారు.

ఆటో రిక్షాల అమ్మకాలలో వృద్ధి

కరోనా మూలంగా ఉపాధి అవకాశాలు దెబ్బతినడంతో చాలామంది ప్రత్యామ్నాయంగా ఆటో రిక్షాలు, ట్రాలీ ఆటోలు కొనుగోలు చేస్తున్నారు. 2020–21 లో 358(141 ఆటో రిక్షాలు, 217 గూడ్స్ క్యారేజీలు), 2021–22 లో 347(107 ఆటోరిక్షాలు, 240 గూడ్స్ క్యారేజీలు), 2022–23 లో 651(245 ఆటో రిక్షాలు, 406 గూడ్స్ క్యారేజీ)ల రిజిస్ట్రేషన్‌లు జరిగాయి.

ట్రాక్టర్లు, ట్రాలీలు..

జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం 2020–21 ఆర్థిక సంవత్సరంలో 794 ట్రాక్టర్లు, 435 ట్రాలీలు, 2021–22లో 537 ట్రాక్టర్లు, 257 ట్రాలీలు, 2022–23లో 452 ట్రాక్టర్లు, 136 ట్రాలీలు కొను గోలు చేశారు. కమర్షియల్ అవసరాల కోసం 2020–21లో 672 ట్రాక్టర్లు, 367 ట్రాలీలు, 2021–22లో 457 ట్రాక్టర్లు, 273 ట్రాలీలు, 2022–23 లో 547 ట్రాక్టర్లు, 180 ట్రాలీలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

- స్థలం, తేదీ నిర్ణయించు...
- షబ్బీర్ అలీకి గంప గోవర్ధన్ సవాల్



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చకు తాను ఎప్పుడైనా సిద్ధమేనని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షబ్బీర్ అలీని కామారెడ్డి ప్రజలు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, మంత్రిగా అవకాశం ఇచ్చినా ఆయన చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. అందుకే ఇంటికే పరిమితం చేస్తూ వరుసగా ఓడిస్తున్నారని ఎద్దేవా చేశారు. తనను వరుసగా గెలిపిస్తున్న కామారెడ్డి ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని, బల్దియాలో రూ.165 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. నర్సన్నపల్లి బైపాస్ నుంచి టేక్రియాల్ బైపాస్ వరకు ఆరు వరుసల బీటీ రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, కళాభారతి ఆడిటోరియం నిర్మించానని వివరించారు. కామారెడ్డి పట్టణంలో ముప్పై పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా చేశానని షబ్బీర్ అలీ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. వంద పడకల ఆస్పత్రితో పాటు నూతన భవనం నిర్మించింది, కామారెడ్డికి మెడికల్ కాలేజ్ తెచ్చింది తానేనని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నపుడు షబ్బీర్ అలీ ఆరు సబ్ స్టేషన్లు మంజూరు చేయిస్తే, తాను 13 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయించానని వివరించారు. షబ్బీర్‌అలీ సొంత గ్రామంలో నూతన పంచాయతీ భవనం, ఆయన మండలంలో డబుల్ రోడ్డు కూడా తానే వేయించానని గుర్తు చేశారు. నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, సమయం, స్థలం తెలపాలని షబ్బీర్ అలీని డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

'పాటలతో ఉత్సాహం'



కామారెడ్డి అర్బన్: పాటలు మనిషిలో ఉత్సాహం నింపుతాయని, జానపద సంగీతం ఇంకా అద్భుతంగా ఉంటుందని తాడ్వాయి మండలం దేవాయిపల్లికి చెందిన శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి పేర్కొన్నారు. తాడ్వాయిలో మంగళవారం హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రచయిత కొడి రవీందర్ రచించి రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ రవీందర్‌కు మంచి భవిష్యత్తు ఉందన్నారు. తాను సినిమా పాటలు రాయాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నట్టు రవీందర్ తెలిపారు. సమావేశంలో నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, సర్పంచ్ సంజీవులు, గజల్ కవి సూరారం శంకర్, మెట్టు రవీందర్, పిచ్చయ్య, రాజు, తిమ్మారెడ్డి గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, అనుపాల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మహనీయుల జయంతి నిర్వహించాలి'



కామారెడ్డి టౌన్: మహనీయుల జయంతిని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం మహనీయుల జయంతిపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో అంబేడ్కర్, జగ్జీవన్ రాం జయంతి నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వెంకటేశ్, సహాయ బీసీ అభివృద్ధి అధికారి యాదగిరి, సమన్వయ కమిటీ ప్రతినిధులు మల్లయ్య, రాజలింగం, రాజయ్య, సిద్ధిరాములు, శివరాములు, దేవులా, నరేందర్, బాలయ్య పాల్గొన్నారు.

'పరీక్షలంటే భయం వీడాలి'



బాన్సువాడ రూరల్: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని డీఈవో రాజు సూచించారు. మంగళవారం ఆయన సెక్టోరల్ అధికారి శ్రీపతితో కలిసి బోర్లం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై హెచ్‌ఎం విజయ్‌కుమార్‌కు సూచనలు ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వైద్య కళాశాలలపై దృష్టి సారించండి

- ఎన్‌ఎంసీ అనుమతులు సాధించాలి
- వీసీలో వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశం

కామారెడ్డి టౌన్: వైద్య కళాశాల పనులపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పూర్తి చేయించాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న 9 వైద్య కళాశాలల పనుల పురోగతిపై మంగళవారం ఆయన టీఎస్‌ఎంఐడీసీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కామారెడ్డితో పాటు కరీంనగర్, జనగామ, వికారాబాద్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలలో నూతన వైద్య కళాశాల పనుల జరుగుతున్నాయన్నారు. ఈ కళాశాలల పనులను జాతీయ వైద్య కమిషన్ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందని, రాష్ట్రంలో ఇప్పటికే 6 వైద్య కళాశాలల పనులను పరిశీలించిందని వివరించారు. జూలై నుంచి మొదటి విడత అడ్మిషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో వైద్య కళాశాలలను సన్నద్ధం చేసి ఎన్‌ఎంసీ నుంచి అనుమతి సాధించాలని మంత్రి ఆదేశించారు. వైద్య కళాశాల విద్యార్థుల కోసం హాస్టల్ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను పరిశీలించి, అక్కడ అవసరమైన మరమ్మతులు చేయించాలని సూచించారు. వైద్య కళాశాల ఏర్పాటుకు అవసరమైన బెడ్ల సంఖ్యను జిల్లా ఆస్పత్రికి అనుబంధంగా నిర్మించాలని, ఆ పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆదేశించారు. ఆరోగ్య మహిళ కేంద్రాల సేవలను విస్తృతం చేయాలన్నారు. కంటి వెలుగును కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సీపీఆర్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో టీఫా స్కానింగ్ యంత్రం అందుబాటులో ఉంచామని, దీనిపై గర్భిణులలో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.

జిల్లాలో ఆరోగ్య మహిళ కార్యక్రమంపై దృష్టి పెట్టినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఎర్రాపహాడ్, డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మహిళలకు 8 రకాల పరీక్షలు చేస్తున్నామన్నారు. కంటి వెలుగు ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 2,48541 మందికి పరీక్షలు చేశామని, 39,171 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, కామారెడ్డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీశ్‌రావుతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్, మెడికల్ కళాశాల వైద్యాధికారులు

అభివృద్ధిలో దేశానికి తెలంగాణ ఆదర్శం



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- రైతు బీమా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదే
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం

బాన్సువాడ రూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇబ్రాహింపేట్‌లో రూ. 30 లక్షలతో చేపట్టిన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం రూ. 12.48 లక్షలతో మన ఊరు –మనబడిలో అభివృద్ధి చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. రూ.17 లక్షలతో నిర్మించిన ముస్లిం శ్మశానవాటిక ప్రహరి, రూ.10 లక్షలతో నిర్మించిన బోయ సంఘం ప్రహరి, రూ.20 లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవనం, రూ.12 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ ప్రహరీ, రూ.16 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాలను స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రైతుబీమా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. బాన్సువాడ మాతాశిశు ఆస్పత్రికి జాతీయస్థాయి గుర్తింపు లభించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలోని ఒక్కో నియోజకవర్గానికి 1,400 డబుల్ బెడ్ రూం ఇళ్లను మాత్రమే కేటాయించారని, బాన్సువాడ నియోజకవర్గానికి తాను 11 వేల ఇళ్లను మంజూరు చేయించానని పేర్కొన్నారు. ఇందులో 8 వేల ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకున్నారన్నారు. సొంత స్థలంలో ఇలు కట్టుకోవాలనుకునేవారికోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకువస్తోందన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మాగోపాల్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు మోహన్‌నాయక్, దొడ్ల వెంకట్రాంరెడ్డి, దేవారం నారాయణరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సాయిరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు యాదవ్, వసియొద్దీన్, పండరి, బండి రమేశ్, విఠల్, సాయిలు, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'నెలాఖరులోపు సీఎంఆర్ పూర్తి చేయాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్: గత ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వానకాలం, యాసంగి సీజన్‌ల ధాన్యం కస్టం మిల్లింగ్(సీఎంఆర్) నెలాఖరులోపు పూర్తయ్యేలా చూడాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సీఎంఆర్‌పై సమీక్ష నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేయని రైస్ మిల్ యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో పద్మ, డిప్యూటీ తహసీల్దార్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండాలని ఐడీసీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్ సొసైటీల అధ్యక్షులకు సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఐడీసీఎంఎస్ కార్యాలయంలో 53వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో 40కిపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, త్వరలో వీటిని ప్రారంభించుకోవాలన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు చేసిన వ్యాపారం, ఖర్చులు అలాగే వచ్చే ఏడాదికి ఆదాయ, వ్యయ అంచనాలను సమావేశంలో చర్చించి తీర్మానించారు. సొసైటీ చైర్మన్లకు గౌరవ వేతనాలు ఇవ్వాలని, ప్రోటోకాల్ అమలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు, డీసీవో సింహాచలం, పీఏసీఎస్ చైర్మన్లు, బిజినెస్ మేనేజర్ నగేశ్ పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం

- గడపగడపకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి
- మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్: అభివృద్ధి పనులతో పాటు మహిళలు, రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. మంగళవారం జుక్కల్ మండలం సావర్‌గావ్ గ్రామంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపుతోందన్నారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్, ప్రవసం తర్వాత కేసీఆర్ కిట్, ఆరోగ్య లక్ష్మి కింద ఆడ పిల్ల జన్మిస్తే రూ. 13 వేలు, మగబిడ్డ అయితే రూ. 12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. గురుకులాలను స్థాపించి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి గడపకు చేరాయన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నీలు పటేల్, సాయాగౌడ్, మాధవ్‌రావ్ దేశాయ్, శివాజీ పటేల్, రవి పటేల్, అనితా పాటిల్, భాను గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రజత పతక విజేతకు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి) : ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ ఉమెన్స్ టోర్నీ –2023లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించిన పవార్ ఉమను మంగళవారం తెయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం ఉమ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ సెకండ్ ఇయర్ చదువుతోంది. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ ఇంచార్జి సంపత్, ఉమ కోచ్ పీ.శ్రీనివాస్, గిరిరాజ్ కళాశాల పీడీ బి బాలమణి, వర్సిటి ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత, కిక్‌బాక్సింగ్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ యువతకు శిక్షణ



నిజామాబాద్ నాగారం : జిల్లాలో ఉన్న మైనారిటీ యువతకు న్యాక్ ద్వారా కన్‌స్ట్రక్షన్ విభాగంలో ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం నగరంలోని ఐటీఐ ఆవరణలో ఉన్న న్యాక్ శిక్షణ కేంద్రంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. 3 నెలల పాటు కన్‌స్ట్రక్షన్ విభాగంలో సూపర్‌వైజర్ పోస్టు కోసం శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. మైనార్టీ యువతకు శిక్షణ ఇవ్వడానికి నిరుద్యోగులను తీసుకురావడంతో కృషి చేసినందుకు సయ్యద్‌ఖైసర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఇన్‌స్ట్రక్టర్ సరోజ, జమాతే ఇస్లామి ప్రతినిధి షేక్ హుస్సేన్, అబ్దుల్ అలీం, మైనారిటీ యువత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



కామారెడ్డి రూరల్: సౌత్ ఇండియా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఇస్రో నుంచి జాతీయస్థాయి ప్రతిభా పురస్కారం పొందిన చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విజయగిరి రామకృష్ణను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కామారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టగోని గోపిగౌడ్, మాజీ సర్పంచ్ రామాగౌడ్, ఎంపీటీసీలు నీలమ్మ రాజు, కమ్మరి అనంతలక్ష్మీ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ కమ్మరి లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయు డు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలరక్షణ పేరుతో అక్రమాలు

- జీర్క్యూర్ చెక్‌డ్యాం పనులు ఆలస్యం
- తరలిపోతున్న ఇసుక
- మౌనం వహిస్తున్న అధికారులు

బాన్సువాడ : సహజ వనరులు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉండగా అధికారులు నిద్రావస్థలో ఉండడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెక్ డ్యాం నిర్మాణం పేరుతో (కంకర, ఇసుక మిక్సింగ్) ప్లాంటు ఏర్పాటు చేసి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. వారి ఆట కట్టించాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ అనుమానాలకు తావిస్తున్నారు. బీర్కూర్ మండలంలోని మంజీర తీరంలో నాణ్యమైన ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తోడేస్తూ రూ. కోట్లు దండుకుంటున్నారు. నిర్దేశించిన చెక్‌డ్యాం నిర్మాణం పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం.

ఉద్దేశ పూర్వకంగానే..

భూగర్భ జలాల వృద్ధే లక్ష్యంగా మంజీర నదితో పాటు వాగులు, నదులపై చెక్‌డ్యాంల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. బాన్సువాడ చింతల్‌నాగారం శివారులో చెక్ డ్యాం పనులు పూర్తయి భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. దీంతో వ్యవసాయ బోరుల్లో పుష్కలంగా నీటి మట్టం పెరిగింది. బీర్కూర్‌లో నిర్మించాల్సిన చెక్‌డ్యాం పనులు నిలిచిపోయాయి. నిర్మాణ పనుల కోసం నెలకొల్పిన మిక్సింగ్ ప్లాంట్ ఇక్కడి నుంచి తరలించాల్సి ఉండడంతో పాటు సమీపంలో ఇసుక క్వారీల్లో తవ్వకాలు నిలిపేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్లు కూటమిగా ఏర్పడి ఉద్దేశపూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.



బీర్కూర్ మంజీర నదిలో చెక్‌డ్యాం నిర్మించాల్సిన ప్రదేశమిదే..

మంజీర తీరంలో..

మంజీర తీరంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న తవ్వకాలు గనులు, రెవెన్యూ, పోలీస్ శాఖలకు కూడా తెలిసిన విషయమే. వీటికి తోడు బీర్కూర్ మిక్సింగ్ ప్లాంట్ వల్ల గుట్టలు గుల్లవుతున్నాయి. ఇక్కడి నుంచి ఇసుక, కంకరను మిక్సింగ్ చేసి ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్లాంటు నుంచి 25 కిమీ పరిధికి మించి రవాణాకు అవకాశం లేకున్నా ఇష్టారాజ్యంగా ప్రకృతి సంపదను దోచేస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్–ఐపాస్ ద్వారా ప్లాంట్‌కు అనుమతి పొందినట్లు చెబుతున్నారు. ఏదేమైనా చెక్‌డ్యాం నిర్మాణ పనులు మూడేళ్లుగా ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చదువులో నేనెప్పుడూ ముందే..

- తాను చదువుకున్న పాఠశాలను చూసి మురిసిన స్పీకర్ పోచారం
- మీరంతా నా స్కూల్‌మేట్స్ అంటూ చిన్నారులతో చిట్‌చాట్

బాన్సువాడ రూరల్ : ''ఇదే పాఠశాలలో నేను 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నా.. రెండు గదులు, పూరిపాక ఉండేవి. ప్రతిసారి నేను ఫస్ట్ వచ్చేవాడిని..1954 నుంచి 1959వరకు చదువుకున్న సమయంలో నా గురువు మోజెస్ నన్ను చాలా ప్రోత్సహించేవారు'' అంటూ చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ మురిసిపోయారు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. మంగళవారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో మన ఊరు –మనబడి కార్యక్రమంలో అభివృద్ధి చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఈరోజు ప్రారంభించిన పాఠశాలలో తాను చదువుకున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్, గ్రామస్తులకు తెలియజేశారు. తాను చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేవాడినని, ఉదయం ప్రార్థన చదివించేవాడినన్నారు. గురువు మోజెస్ తనను ఇంగ్లిష్, గణితం బాగా చదివి భవిష్యత్‌లో ఇంజినీర్ కావాలని ప్రోత్సహించడంతో తాను ఇంజనీరింగ్ చేశానన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం, కలెక్టర్ జితేష్ వి పాటిల్

చదువుకునే రోజుల్లో రెండో క్లాస్ నుంచి ఎప్పుడూ క్లాస్ ఫస్ట్ లేదా సెకండ్ వచ్చేవాడినన్నారు. నేను మీ పాఠశాలలోనే చదువుకున్నాను కాబట్టి మీరంతా నా స్కూల్‌మేట్స్ అంటూ చిన్నారులను ఉత్సాహపర్చారు. అనుకున్న లక్ష్యం సాధించాలంటే కష్టపడి చదవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇబ్రహీంపేట్ సర్పంచ్‌గా ఉన్న నారాయణరెడ్డి తన బావమరిది అని వారి అక్క పుష్పను వివాహమాడి ఈ ఊరి అల్లుడిని అయ్యానన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చదువుకున్న పాఠశాలలను తాను ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

బీఈడీ పరీక్ష తేదీల్లో మార్పు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల వినతి మేరకు పలు సబ్జెక్టుల పరీక్షల తేదీలు మార్చినట్లు కంట్రోలర్ తెలిపారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల బీఈడీ విద్యార్థులు ఈ విషయం గమనించాలని, పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని ఆమె సూచించారు.

తెల్ల చొక్కాపై చెరగని జ్ఞాపకం..





ఓ ప్రైవేట్ కళాశాల వద్ద విద్యార్థి షర్ట్‌పై ఆటోగ్రాఫ్ ఇస్తున్న అతడి స్నేహితులు

పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయ్.. ముందుగానే పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు విద్యార్థులకు సెలవులిచ్చేశారు.. దీంతో ఇన్నాళ్లు కలిసి చదువుకున్న విద్యార్థులు భారంగానే ఒకరినొకరు వీడుతూ బెస్ట్ ఆఫ్ లక్ చెప్పుకున్నారు. ఇందులో భాగంగా నగరంలో ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద ఓ విద్యార్థి చొక్కాపై మిత్ర బృందం అంతా ఇలా సంతకాలు చేసి తమ స్నేహితుడికి వీడ్కోలు పలికారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

వేసవిలో చెరువుల అలుగులు పారుతున్నాయ్



అమీనాపూర్ సమీపంలో చెరువులకు వెళ్తున్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : సీఎం కేసీఆర్ వల్ల ఎండాకాలంలో చెరువులు అలుగులు పారుతున్నాయని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మోర్తాడ్ పర్యటన ముగించుకొని వేల్పూర్ వెళ్తుండగా అమీనాపూర్ వద్ద కాలువలో ప్రవహిస్తున్న గుత్ప, నవాబు లిఫ్టుల నీటిని చూసి సంబురపడ్డా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్ప, నవాబు లిఫ్టుల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో చెరువులు అలుగులు పారుతున్నాయని పేర్కొన్నారు. ఈ రెండు లిఫ్టుల ద్వారా వేల్పూర్ మండలంలో వేల్పూర్, అమీనాపూర్, కుకునూర్, లక్కోర, కోమన్‌పల్లి, వెంకటాపూర్, అంక్సాపూర్, దొన్కల్ గ్రామాలలోని 12 చెరువులు మండుటెండల్లో అలుగులు పారడం ఆనందంగా ఉందన్నారు.

ప్రాచీన చరిత్రకు నిలయం తెలంగాణ

- తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్



తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ సదస్సులో మాట్లాడుతున్న తెయూ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ ప్రాంతం ప్రాచీన చరిత్రకు నిలయమని, నిజామాబాద్ జిల్లా చరిత్ర కూడా ఎంతో ప్రాచీనమైనదని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ అన్నారు. తెయూ క్యాంపస్ లా కళాశాల సెమినార్‌హాల్‌లో మంగళవారం తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రారంభమైన రెండు రోజుల సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన వీసీ జ్యోతివెలిగించి ప్రారంభించారు. 'నిజాం సంస్థానంలో ఆనాటి రైల్వే వ్యవస్థ' అనే అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ కేఎస్ఎస్ శేషన్ నిజాం నాటి రైల్వే వ్యవస్థపైన కీలక ప్రసంగం చేశారు. హర్యానా, కురుక్షేత్ర విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రవీంద్ర కుమార్ శర్మ, తెయూ ఇంచార్జీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ కే.అర్జునరావు, డాక్టర్ జైకిసాన్, ఆర్ సూర్యకుమార్ సదస్సులో ప్రసంగించారు. తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరాజం ప్రారంభ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ కార్యదర్శి వీరేందర్ సదస్సు లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్త బాల శ్రీనివాసమూర్తి, అధ్యాపకులు బి.సాయిలు, సీహెచ్ ఆంజనేయులు, కే.రవీందర్ రెడ్డి, మహమ్మద్ అబ్దుల్‌ఖవి, వి.త్రివేణి, పలువురు చరిత్ర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీతో ట్యాలీ సంస్థ ఎంఓయూ

తెయూ, ట్యాలీ ఎడ్యుకేషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ మధ్య ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ మేరకు మంగళవారం ట్యాలీ ప్రాంతీయ సహాయ నిర్వాహకులు మల్లేష్ గుప్తా, తెయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్, ఇంచార్జీ రిజిస్ట్రార్ విద్యావర్ధిని ఒప్పంద అవగాహన (ఎంఓయూ) పత్రాల మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.యాదగిరి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.అపర్ణ, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బయో ఇన్ఫర్మాటిక్స్ నూతన ల్యాబ్

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ బయోటెక్నాలజీ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన బయో ఇన్ఫర్మాటిక్స్ ల్యాబ్‌ను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ మంగళవారం ప్రారంభించారు. ఈ ల్యాబ్ ఏర్పాటుకు అంతర్జాతీయ కంపెనీ ఇంటెల్ ఆర్థిక సాయం అందించగా, మరో కంపెనీ యునైటెడ్ వే సహకరించినట్లు వీసీ తెలిపారు. ఈ ల్యాబ్‌లో 30 కంప్యూటర్లు, ఒక వర్క్‌స్టేషన్ ఉన్నట్లు తెలిపారు. ఈ ల్యాబ్ ఏర్పాటుకు రూ.48లక్షలు మంజూరుకు కృషి చేసిన ఐక్యూఏసీ డైరెక్టర్ మామిడాల ప్రవీణ్ ను వీసీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యార్థిని, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్‌ఆరతి, విభాగాధిపతి జవేరియా, ప్రొఫెసర్ కనకయ్య, బాలకిషన్ తదితరులున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం : ఆర్థిక సమస్యల కారణంగా ఒకరు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం అడ్లూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దెబ్బటి నవీన్ (23) కామారెడ్డిలో అడ్డా కూలీగా పనిచేస్తుండేవాడు. కూలి పనులు సరిగా దొరకక ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. భార్య, పిల్లలతో కలిసి రాజీవ్ నగర్ కాలనీలోని తన తల్లిగారింటికి రాగా మధ్యాహ్నం నవీన్ తన ఇంట్లో ఉరేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య స్వరూప దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కరోనా తర్వాత విద్యావిధానంలో మార్పులు

నిజామాబాద్ అర్బన్ : కరోనా కంటే ముందు ఉన్న విద్యావిధానంలో కంటే కరోనా తర్వాత విధానంలో చాలా మర్పులొచ్చాయని తమిళనాడు అన్నామలై యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీణ పేర్కొన్నారు. మంగళవారం సారంగపూర్‌లో రెండో రోజు జాతీయ విద్యావిధానం–2020 అనే అంశంపై సదస్సు నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు.

మోదీని ప్రశ్నించినందుకే రాహుల్‌పై వేటు

- వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు
- మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి
- బోధన్‌లో సత్యాగ్రహ దీక్ష

బోధన్ : పార్లమెంట్‌లో మోదీ, అదానీల మధ్య బంధాన్ని రాహుల్ ప్రశ్నించినందుకే కుట్ర పూరితంగా ఆయన చట్టసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేశారని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వ్యక్తులకు ఈడీ నోటీసులు జారీ చేసి విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు, కేంద్ర బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నియోజక వర్గ స్థాయి సత్యాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు.

దీక్షలో కూర్చున్న సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అదానీ ఆర్థిక వ్యవహారాలపై పార్లమెంట్‌లో చర్చ జరుగాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు నిత్యావసర సరుకులు, చమురు ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో సిలిండర్ ధర రూ. 400 ఉంటే ఇప్పుడు రూ.1,200లకు పెంచారన్నారు. ప్రజాస్వామ్య, ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సత్యాగ్రహ దీక్షకు బోధన్ నియోజక వర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలి వచ్చారు.



బోధన్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, డెలిగేట్ గంగా శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌసొద్దీన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మోహినోద్దీన్, నాయకులు పులి శ్రీనివాస్, మోబిన్ ఖాన్, రాజేశ్వర్ పటేల్ తదితరులున్నారు.

స్ఫూర్తి కలిగిస్తున్న 'ధాత్రి' కార్యక్రమాలు

నిజామాబాద్ సిటీ : ధాత్రి సాహితీ సాంస్కృతిక సంస్థ చేస్తున్న కార్యక్రమాలు అందరికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఉప రవాణా శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం ధాత్రి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ధాత్రి విశిష్ట సేవారత్న పురస్కారాలు–2022 పేరుతో కార్యక్రమం నిర్వహించారు. కరోనా సమయంలో సేవలందించిన స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులకు నగదు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ నేటి యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ నిరంతరం సమాజానికి ఏదైనా చేయాలనే తపనతో మల్లవరపు విజయ చేస్తున్న సాహిత్య సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో ముత్యం నరేష్ (ఇందల్వాయి), వినయ్ (ఫుడ్ బ్యాంక్), రమణాచారి (శ్రీలక్ష్మీ చేయూత), శ్రీరామ్ నవీన్ చారి(మన ఊరు మన బాధ్యత వెల్ఫేర్ సొసైటీ), డాక్టర్ మద్దుకూరి సాయిబాబు(ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ), పి.నర్సింగ్ రావ్(పోలీస్‌శాఖ)లకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షురాలు షహీద్మియా, గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, తొగర్ల సురేశ్, కళాశాల విద్యార్థులు, ధాత్రి సాహితీ సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



స్వచ్ఛంద సేవలందించిన వారికి పురస్కారాలు అందజేస్తున్న ధాత్రి సేవా సంస్థ సభ్యులు

పీడీ యాక్ట్ నమోదు



కామారెడ్డి టౌన్ : తరచూ నేరాలు చేస్తూ కామారెడ్డి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న ఓ వ్యక్తిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ బి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన 30 ఏళ్ల యువకుడు బొజ్జ విష్ణు అలియాస్ పోచాద్రి, అలియాస్ పోచయ్య నేరస్తుడిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి మంగళవారం చంచల్‌గూడ జైలుకు పంపినట్లు తెలిపారు. జిల్లా పరిధిలో పోలీసు అధికారిగా నటిస్తూ దొంగతనాలు, దోపిడీ, హత్యాయత్నం వంటి నేరాలను తరుచుగా పాల్పడుతున్నట్లు తెలిపారు. 2017 నుంచి బోయిన్‌పల్లి, ఎల్‌బీ నగర్, కామారెడ్డి పట్టణం, దేవున్‌పల్లి, మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో 9 నేరాలు చేసాడన్నారు. ఈ సంఘటనలన్నింటి ఆధారంగా అతడిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. పీడీ యాక్ట్ ఉత్వర్తులను పట్టణ సీఐ నరేష్ నేరస్తుడికి అందజేసి చంచల్‌గూడ జైలుకు అప్పగించారు.

క్రైం కార్నర్

భర్తకు జైలు శిక్ష

- భార్య ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు..

బోధన్: భార్యను వేధించి ఆమె ఆత్మహత్యకు కారకుడైన భర్తకు ఐదేళ్ల జైలు శిక్షణ, రూ.200 జరిమాన విధిస్తూ బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దేవన్ అజయ్ కుమార్ మంగళవారం తీర్పును వెల్లడించారు. జరిమానా కట్టకపోతే మరో నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్షణ అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం కోటగిరి మండలంలోని (ప్రస్తుతం పోతంగల్) దోమలెడ్గి గ్రామానికి చెందిన నాగమణి, బోధన్‌కు చెందిన కొప్పుల గజేందర్ ప్రేమించుకుని 2007 జనవరి 24న పెళ్లి చేసుకున్నారు. వీరికి కూతురు హనీష్, కొడుకు సాయి హనీష్ ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత భార్యభర్తల మధ్య తగాదాలు జరుగుతుండేవన్నారు.

2019 ఫిబ్రవరి 24న గజేందర్ తన తమ్ముడి పెళ్లికి వెళ్లే విషయంలో భార్య నాగమణితో గొడవ జరిగింది. పెళ్లికి వచ్చేందుకు ఆమె నిరాకరించడంతో ఆమెను కొట్టాడు. మళ్లీ ఇంటికి తిరిగి వచ్చి రాత్రి సమయంలో నాగమణిని కొట్టి బయటకు వెళ్లిపోయాడు. మనస్తాపంలో అదేరోజు అర్ధరాత్రి సమయంలో నాగమణి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మరుసటి రోజు 2019 ఫిబ్రవరి 25న మృతురాలి తల్లి కోడూరు లక్ష్మి శ్యామల బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అల్లుడు గజేందర్ కోటగిరి గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, తన కూతురు నాగమణిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేయడంతోనే ఆమె మృతి చెందిందని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణనంతరం జడ్జీ తీర్పునిచ్చారు.

నిందితురాలిని పట్టించిన సీసీ ఫుటేజీ

ఖలీల్‌వాడి : సీసీ ఫుటేజీ ఆధారంగా మార్కెట్‌లో డబ్బులు చోరీ చేస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 20న నగరంలోని దేవిరోడ్డులో ఆకుల ప్రగత్ తన భార్య బంగారాన్ని ఓ గోల్ మర్చంట్ వద్ద తాకట్టు పెట్టి రూ. 4 లక్షలు తీసుకున్నారు. అనంతరం దేవిరోడ్డులోని కిరాణాషాపు వద్ద సామాను కొనేందుకు వెళ్లి షాపులో తన డబ్బుల బ్యాగును పక్కన పట్టి, సామాను కొనుగోలు చేశారన్నారు. సామాను కొనుగోలు పూర్తయిన తర్వాత బ్యాగ్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు దుకాణంలో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా వర్ని రోడ్డులోని చంద్రనగర్‌కు చెందిన బియాస్ వనజను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మహిళను పట్టుకున్న ఏఎస్సై షకీల్, రాజేష్, గంగారాం, అబ్దుల్ రహెమాన్‌ను ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు.